## అన్నదాతల అరిగోస ప్రభుత్వానికి పట్టదా: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి – బాధ్యులెవరని ప్రశ్నించారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో చాలాచోట్ల వడ్లు కొట్టుకుపోతున్నా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. అన్నదాతల బాధలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా అంటూ కేంద్ర మంత్రి నిలదీశారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కొనుగోళ్లు లేక రైతులు అరిగోస పడుతుంటే పట్టించుకోవడం లేదని బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతుల ఆరుగాలం కష్టమంతా నీళ్లపాలవుతోందన్నారు. ప్రతి గింజ కొనుగోలుకు కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమిటని అన్నారు. వడ్లను కొనుగోలు చేసినందుకు కమీషన్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమే చెల్లిస్తోందని.. అయినా వడ్ల కొనుగోలులో నిర్లక్ష్యం ఎందుకని మండిపడ్డారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లకు గాను 16 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేని దుర్మార్గపు ప్రభుత్వమిది అంటూ విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రికి ఢిల్లీ పర్యటనలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేకపోవడం శోచనీయమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. రైతులు పడుతున్న కష్టాలను ప్రస్తావిస్తే ఎదురు దాడి చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన వడ్లను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిందే అని.. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. సీఎం సహా మంత్రులంతా యాసంగి వడ్ల కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## ఆమెను బయటకు గెంటేయండి

మొదటిపేజీ తరువాయి – వినిపిస్తోంది. ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ రాజీనామా చేసేందుకు నిరాకరించడంపై సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమె ప్రవర్తన క్షమించరానిదని, ఇది మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకే విసిరిన సవాల్ అని అభివర్ణించారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల సంఘం ఫలితాలను ధ్రువీకరించిన క్షణం నుంచి ముఖ్యమంత్రి తన పదవిని కోల్పోతారు. అయినా ఆమె కుర్చీకి అతుక్కుపోవాలని చూస్తున్నారు. ఇది అవమానకరం. ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలి. గౌరవంగా రాజీనామా చేయకుండా మొండికేస్తున్నందున, గవర్నర్ తన అధికారాలను ఉపయోగించి ఆమెను అధికారికంగా బర్తరఫ్ చేయాలి. ఆమె ప్రవర్తన దృష్ట్యా, ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలి. ఆఫీస్ నుంచి ఆమెను బయటకు గెంటేయాలి" అని జెఠ్మలానీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె ఇప్పటికీ కార్యాలయాన్ని ఆక్రమించుకుంటే, గవర్నర్ పోలీసులను పంపి ఖాళీ చేయించవచ్చని సూచించారు. "ఫలితాలు ధ్రువీకరించిన తర్వాత ఆమె సీఎం కార్యాలయంలో ఒక చొరబాటుదారు మాత్రమే" అని స్పష్టం చేశారు. మరోవైపు తాను ఓడిపోలేదని, అందుకే రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేయనని మమతా బెనర్జీ ప్రకటించారు. తన పార్టీ నుంచి 100 సీట్లను దొంగిలించారని ఆమె ఆరోపించారు. దీనిపై జెఠ్మలానీ స్పందిస్తూ, ఆరోపణలకు ఆధారాలుంటే కోర్టుకు వెళ్లాలని, అక్కడ కూడా ఆమెకు చుక్కెదురయ్యే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. బెంగాల్ అసెంబ్లీ ప్రస్తుత టర్మ్ ఈ నెల 7తో ముగియనుండటంతో ఈ పరిణామాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి.

## 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి – నేతృత్వంలో చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.c

## అమెరికా నౌకలపై డాల్ఫిన్లతో దాడికి ఇరాన్ కుట్ర?

మొదటిపేజీ తరువాయి – దించనుందంటూ వస్తున్న వార్తలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ ఊహాగానాలపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పందించారు. ఇరాన్ వద్ద అటువంటి డాల్ఫిన్ సైన్యం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, అమెరికా వద్ద ఉన్నాయా? అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేశారు. "మా వద్ద కామికేజ్ డాల్ఫిన్లు ఉన్నాయో? లేదో? నేను ధ్రువీకరించలేను. అలా అని ఖండించలేను. కానీ, ఇరాన్ వద్ద మాత్రం అవి లేవని కచ్చితంగా చెప్పగలను" అని ఒక మీడియా సమావేశంలో హెగ్సెత్ అన్నారు. ఏప్రిల్ 30న వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన ఒక కథనంతో ఈ చర్చ మొదలైంది. అమెరికా యుద్ధ నౌకలపై దాడి చేసేందుకు ఇరాన్ "మైన్లు మోసుకెళ్లే డాల్ఫిన్లను" ఉపయోగించవచ్చని ఆ కథనం పేర్కొంది. మరోవైపు అమెరికా నౌకాదళం దశాబ్దాలుగా డాల్ఫిన్లను సైనిక అవసరాలకు వినియోగిస్తోంది. యూఎస్ నేవీకి చెందిన "మెరైన్ మమ్మల్ ప్రోగ్రామ్" కింద బాటిల్‌నోస్ డాల్ఫిన్లు, కాలిఫోర్నియా సీ లయన్‌లకు శిక్షణ ఇస్తున్నారు. అయితే, ఇవి ఇరాన్ వాడొచ్చని ప్రచారంలో ఉన్న "కామికేజ్ డాల్ఫిన్ల" వంటివి కావు. అమెరికా డాల్ఫిన్లు కేవలం సముద్ర గర్భంలో మైన్లను గుర్తించి, వాటి లొకేషన్‌ను మార్క్ చేస్తాయి. అంతేగాని, ఆత్మాహుతి దాడులు చేసి ప్రాణాలు త్యాగం చేయవు. "డాల్ఫిన్ల సోనార్ వ్యవస్థ ముందు సైన్స్‌కు తెలిసిన ఏ టెక్నాలజీ సరిపోదు. నీటి అడుగున పనిచేసే డ్రోన్‌లు కూడా వీటికి సాటిరావు" అని ఈ ప్రోగ్రామ్ వెబ్‌సైట్ పేర్కొంది. గతంలో రష్యా తమ నౌకాశ్రయాల భద్రతకు డాల్ఫిన్లను వాడింది. 2000 సంవత్సరంలో ఇరాన్ కూడా కొన్ని డాల్ఫిన్లను కొనుగోలు చేసింది. అయితే, అవి ఇప్పుడు వయసు పైబడటం వల్ల ఉపయోగంలో ఉండే అవకాశం లేదని, ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్రియాశీల డాల్ఫిన్ ప్రోగ్రామ్ ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతానికి హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాల్లో అమెరికా డాల్ఫిన్లను ఉపయోగించడం లేదని సీఎన్ఎన్ కథనం పేర్కొంది.

## విజయ్‌కు మద్దతుగా కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి – విజయం సాధించి, డీఎంకే-అన్నాడీఎంకేల ఆధిపత్యానికి గండికొట్టిన నటుడు విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే)కు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. టీవీకేకు మద్దతు ఇచ్చే అధికారాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి (టీఎన్‌సీసీ) అప్పగించినట్లు కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ తెలిపారు. విజయ్ ప్రభుత్వంలో రెండు మంత్రి పదవులు ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎన్డీయే లేదా దాని మిత్రపక్షాలతో కలవకూడదనే షరతును కాంగ్రెస్ పెట్టింది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. మెజారిటీకి కేవలం 10 సీట్ల దూరంలో నిలిచింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఉన్న 5 సీట్లతో వారి బలం 113కు చేరింది. త్వరలోనే గవర్నర్‌ను కలిసి మద్దతు లేఖను సమర్పించనున్నారు. దీంతో విజయ్ రేపటికల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ తాజా నిర్ణయంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకే-కాంగ్రెస్ కూటమి విచ్ఛిన్నమైంది. ఈ పరిణామంపై డీఎంకే తీవ్రంగా స్పందించింది. ఇది 'వెన్నుపోటు' అని డీఎంకే అధికార ప్రతినిధి ఎ. శరవణన్ ఆరోపించారు. తమ మద్దతు లేకుండా కాంగ్రెస్ ఆ ఐదు సీట్లు కూడా గెలిచేది కాదని ఆయన విమర్శించారు.

## వైసీపీ నాయకుల నేరచరిత్రను ప్రపంచస్థాయి ఇన్వెస్టిగేషన్ ఛానల్ బయటపెట్టింది

మొదటిపేజీ తరువాయి – క్రిమినల్ పార్టీ, గొడ్డల పార్టీ, మాఫియా పార్టీకి అధ్యక్షుడని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచుకొని ఆ కంపెనీలన్నిటిని ఆంధ్రప్రదేశ్‌కి నారా చంద్రబాబునాయుడు ఏ రకంగా తీసుకువస్తున్నారో అందరూ చూస్తున్నారని అన్నారు. జగన్ రెడ్డి ప్రపంచస్థాయి స్మగ్లర్ తో, నేర చరిత్రలతో ఉన్న వ్యక్తులతో సహవాసం చేశారని ఆరోపించారు. వైసీపీ పార్టీని గొడ్డళ్ల పార్టీ అంటుంటే వైసీపీ నేతలు గింజుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ లో ఉపయోగించే గొడ్డళ్ళన్నీ ఇడుపులపాయ నుంచి వెళ్ళయని వైసీపీ నాయకులు తెలుసుకోవాలని అన్నారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో, అతడిని గొడ్డలితో ఏడుసార్లు నరికి నరికి చంపారని ఆరోపించారు. అలాంటి పార్టీని గొడ్డల పార్టీ అనకుండా ఏమంటారని ప్రశ్నించారు. 30 క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి ఏ రకంగా బెయిల్ పై తిరుగుతున్నాడో అదే విధంగా అతను అనుచరుడు కొల్లం గంగిరెడ్డి 27 కేసులతో బెయిల్ మీద బయట తిరుగుతున్నాడని మండిపడ్డారు. జగన్ రెడ్డి విజయవాడ, తాడేపల్లిని వదిలిపెట్టి బెంగళూరులోనే కూర్చొని నేరాలు, ఘోరాలు పాల్పడడానికి స్కెచ్‌లు వేసుకుంటున్నారని విమర్శించారు. గొడ్డళ్ల పార్టీకి ప్రజలు ఇప్పటికే 11 సీట్లతో సరైన బుద్ధి చెప్పారని అన్నారు. వైసీపీ సంబంధించిన ఏ నాయకుడిని వెనుక చూసినా ఒక నేర చరిత్ర ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇన్వెస్టిగేషన్ ఛానల్ లో మరికొంతమంది వైసీపీ నాయకుల నేర చరిత్రలు రాబోతున్నాయని పంచుమర్తి అనురాధ అన్నారు.

# అది నిరూపిస్తే రాజీనామా చేస్తా

మొదటిపేజీ తరువాయి – వరంగల్, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు(బుధవారం) వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

**నా సవాల్ స్వీకరించాలి..**

ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో లేదో చెప్పాలని అన్నారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. కానీ యూరియా బస్తాలు ఇచ్చేది మాత్రం తెలియదని కేటీఆర్ విమర్శించారు.

**కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్..**

బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. కానీ యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదా అని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ ఒక బోగస్ పత్రం, చిత్తుకాగితమని విమర్శించారు. ఓట్టుపెట్టి ఓట్లు అడిగి రేవంత్‌రెడ్డి నయవంచన చేశారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అది మెగా రైతు మేళా కాదని.. దగా రైతు మేళా అని విమర్శించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఫొటోలు పోలీసుస్టేషన్ల దగ్గర గోడలపై అతికించి... వీళ్లు దొంగలని రాయాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్.. కరోనా కంటే డేంజర్ అని సెటైర్లు గుప్పించారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు.

# ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి

మొదటిపేజీ తరువాయి – ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ 'క్యారియర్ గ్లోబల్' యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

**డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ**

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు. ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

## తెలంగాణలో ప్రజాపాలనకు కొత్త దిశ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది : గాదె శివ

**మొదటిపేజీ తరువాయి – నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 6:** ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కొనసాగుతోంది. అలాగే, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు కార్యక్రమం కూడా పురోగమిస్తోంది. చెరువుల పునరుద్ధరణ, పార్కుల అభివృద్ధి వంటి పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతోంది. హైడ్రా చర్యల ద్వారా వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడటం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ వేగవంతమై, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. దీని వల్ల యువతలో ఆనందం వ్యక్తమవుతోంది. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, ప్రతి నెల మొదటి తారీఖునే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించడం ద్వారా పాలనలో క్రమశిక్షణను చూపిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా చిన్నారుల పోషణ, విద్యకు ప్రాధాన్యత ఇస్తోంది. విద్యారంగంలో నాణ్యమైన ఫలితాల కోసం కొత్త విధానాలను అమలు చేస్తూ, విద్యార్థుల ప్రతిభను పెంపొందిస్తోంది. ప్రారంభ స్థాయి నుంచి ఉన్నత స్థాయివరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచే చర్యలు తీసుకుంటోంది. అలాగే, విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన వారికి రూ.1 కోటి వరకు నష్టపరిహారం ప్రకటించడం వంటి సంక్షేమ చర్యలు కూడా ప్రభుత్వం చేపడుతోంది. ఇటువంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబాటును స్పష్టం చేస్తున్నాయి. గత పదిహేను సంవత్సరాలుగా పరిష్కారం కాని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిసన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు ప్రారంభించింది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు వేగవంతమైన చర్యలు చేపడుతోంది. అలాగే, ఆర్టీసీ కార్మికుల సమస్యలను గతంలో పరిష్కరిస్తామని చెప్పి అమలు చేయని పరిస్థితుల్లో, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించే దిశగా గట్టి చర్యలు తీసుకుంది. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన విధానాలు అమలు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రం అప్పుల భారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటోంది. పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నది ఇందుకు నిదర్శనం. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రిజర్వేషన్ల అమలు, మహిళల రాజకీయ సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి కీలక చర్యలు తీసుకుంటోంది. "తెలంగాణ రైజింగ్ 2047" లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేస్తోంది.

## రాష్ట్రానికి తరగని ఆస్తి ఇనుప ఖనిజం: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – ఆదేశించారు. గనుల శాఖపై ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రంలోని మొత్తం 17 ఐరన్ ఓర్ బ్లాకులకు గాను ఇప్పటికే కేటాయించినవి మినహా, మిగిలిన బ్లాకులను వివిధ సంస్థలకు కేటాయించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. 2030 నాటికి ఏడాదికి 30 మెట్రిక్ టన్నులు, 2035 నాటికి ఏడాదికి 113 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఐరన్ ఓర్ వినియోగం అనేది 4 రెట్లు పెరిగే అవకాశం ఉందని, రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇనుప ఖనిజం లభ్యత అద్భుత అవకాశంగా ఉందని అన్నారు. ఈ రంగంలో రూ.1.90 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.52 లక్షల ఉద్యోగాలు సృష్టి జరుగుతుందని సీఎం అన్నారు. తక్కువ గ్రేడ్ మాగ్నటైట్ ఖనిజాన్ని ప్రాసెస్ చేయడానికి ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్దేశించారు. ఖనిజాల అన్వేషణ వేగంగా చేపట్టడంతో పాటు, లీజుల అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేలా అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం పెంచే దిశగా: రాష్ట్రంలో దాదాపు 1,938 మిలియన్ టన్నుల వరకు ఐరన్ ఓర్ నిల్వలు కలిగి ఉండటంతో అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉందని సీఎం అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా సంస్థ 17.8 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తుండగా, రాయలసీమలో జేఎస్‌డబ్ల్యు సంస్థ కూడా భారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. 2035 నాటికి వీటి సామర్థ్యం ఏడాదికి 20 మెట్రిక్ టన్నులకు పైగా ఉంటుందన్నారు. దీంతో రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం పెంచే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రధాన ఖనిజ రాష్ట్రాల కంటే ఇది అత్యధిక వృద్ధి: 2025-26లో లక్ష్యాన్ని మించి గనుల శాఖలో 108 శాతం ఆదాయాన్ని ఆర్జించినట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గనుల శాఖ రూ3,416 కోట్లు ఆదాయం సాధించింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 32 శాతం అత్యధికంగా ఉంది. కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్,రాజస్థాన్ వంటి ప్రధాన ఖనిజ రాష్ట్రాల కంటే ఇది అత్యధిక వృద్ధి. 2026-27 సంవత్సరానికి గత ఏడాది కంటే 36 శాతం అధికంగా 4,650 కోట్ల లక్ష్యాన్ని సమీక్షలో నిర్ణయించారు. గనుల శాఖలో ఆదాయం పెంచేందుకు మైనింగ్ లీజుల ఆపరేషనలైజేషన్, లైమ్ స్టోన్ ఉత్పత్తి పెంపు, కొత్త లీజుల మంజూరు వంటి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 108 శాతం రాబడి: గనులశాఖ రాబడి పెరిగేలా చూసేందుకు అన్ని గనుల్లో తవ్వకాలు కొనసాగేలా చూడాలని సీఎం ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గనులశాఖ 108 శాతం ఆదాయం పొందినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఆ ఏడాదిలో రూ.3,416 కోట్ల రాబడి వచ్చినట్లు వెల్లడించారు. 2026-27లో రూ.4,650 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. సమీక్షలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ సలహాదారు సతీష్ రెడ్డి, గనులశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఏపీఎండీసీ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో విస్తరణపై కీలక అడుగు

మొదటిపేజీ తరువాయి – ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు మొదటి దశ మెట్రోను ఎల్అండ్‌టీ సంస్థ నిర్వహిస్తుండటంతో, రెండో దశ విస్తరణ సమయంలో ఆపరేషన్ల పరంగా సమన్వయ లోపం ఏర్పడవచ్చని కేంద్రం గతంలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అయితే, ఇప్పుడు మొదటి దశ ప్రాజెక్టు మొత్తం ప్రభుత్వం చేతుల్లోకి రావడంతో ఆ సాంకేతిక అభ్యంతరాలు పూర్తిగా తొలగిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం తన లేఖలో పేర్కొంది. రెండో దశలోని 'ఏ' మరియు 'బి' భాగాలకు సంబంధించి మొత్తం ఏడు మార్గాల సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (ఞూ=ం) వెంటనే ఆమోదించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. మెట్రో రెండో దశ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంగా కేంద్ర అనుమతుల కోసం ఎదురుచూస్తోంది. 2024 నవంబర్‌లోనే దీనికి సంబంధించిన ప్రతిపాదనలు, డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పించినప్పటికీ, మొదటి దశను నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీతో స్పష్టమైన ఒప్పందం ఉండాలని కేంద్రం మెలిక పెట్టింది. ఇప్పుడు ప్రభుత్వమే యజమానిగా మారడంతో, ఒకటి మరియు రెండో దశలు రెండూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉండబోతున్నాయి. దీనివల్ల నిర్మాణ ప్రక్రియ, తదుపరి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని రాష్ట్రం భావిస్తోంది. ఈ కీలకమైన ప్రాజెక్టుపై కేంద్రంతో నేరుగా చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీకి బయలుదేరనున్నారు. జాతీయ రాజధానిలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి, మెట్రో మొదటి దశ స్వాధీనం ప్రక్రియ గురించి వివరించనున్నారు. రెండో దశ విస్తరణకు ఆమోదం తెలపాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక వినతిపత్రాన్ని ఆయన అందజేయనున్నారు. కేంద్ర అనుమతులు లభిస్తే ఈ భారీ ప్రాజెక్టుకు నిధుల సేకరణ సులభతరం కానుంది. మెట్రో విస్తరణకు అవసరమైన రుణాలను అందించేందుకు 'జైకా' (జీ×జూా), 'ఏడీబీ' (ూణదీ) వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించాయి. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, పనులు ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. కాగా, ఈ నెల 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆ పర్యటనలో కూడా మెట్రో రెండో దశ అంశంతో పాటు రాష్ట్రానికి రావాల్సిన ఇతర పెండింగ్ ప్రాజెక్టులపై ప్రధానితో సీఎం రేవంత్ చర్చించనున్నారు. మొత్తానికి సీఎం ఢిల్లీ పర్యటన అటు మెట్రో అనుమతుల సాధనకు, ఇటు రాజకీయ సమన్వయానికి వేదికగా మారనుంది. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో కూడా ఆయన భేటీ కానుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేరళలో యూడీఎఫ్ ఘన విజయానికి రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో, అక్కడి సీఎం ఎంపికపై జరుగుతున్న చర్చలు, ప్రత్యేకించి కేసీ వేణుగోపాల్ పేరు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత రాజకీయ ప్రాధాన్యతను తీసుకొచ్చాయి.

# నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ రౌండ్ టేబుల్ సమావేశం

కల్వకుంట్ల కవిత కామెంట్స్

ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ

50 శాతం నుంచి 120 శాతం స్కూల్ ఫీజులు పెంచినా పట్టించుకోవడం లేదు

1200 మంది బలిదానాలతో వచ్చిన తెలంగాణలో 12 ఏళ్లుగా ఆ సంవేదనతో పాలన సాగలేదు

మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

ఉచిత విద్య, వైద్యం మా పార్టీ విధానం

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 6:** సమానత్వం, స్వేచ్ఛ, మాన విలువలు వర్ధిలాలంటే విద్య ద్వారానే సాధ్యమని ప్రపంచం గుర్తించింది. పిల్లల చదువు బాధ్యత తల్లితండ్రులది మాత్రమేనా? ప్రభుత్వ బాధ్యత కూడా? అసలు చదువుకు సంబంధించిన విధానం ఏంటీ? హెల్త్, ఎడ్యుకేషన్ అనేది ప్రభుత్వాలకు అబ్లిగేషన్ గా ఉండాలి. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలి. కానీ ప్రజలు ఏమైతే మాకేంటీ, ఫీజులు ఎంత పెంచిన నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదు. ఫీజులు కట్టలేక పంజాబ్ లో విద్యార్థులు పార్ట్ టైమ్ మద్యం అమ్ముకునే పరిస్థితి వచ్చింది. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నావే. వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ నాయకులకే విద్యాసంస్థలు ఉండటమనేది కరెక్టా అనేది మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి మనకు ఇప్పుడే సొలుష్యన్ కావాలి. వచ్చే నెలలో మళ్లీ ఫీజులు కట్టాలన్న ఆందోళన పిల్లల తల్లితండ్రులకు ఉంటుంది. చాలా మంది తల్లితండ్రులు ఇప్పటికే ఫీజుల విషయంలో భయంతో ఉన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతి రావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్ట్ కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని...ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారు. పిల్లలు బాగా చదువుకోవాలన్న తల్లితండ్రుల వీక్ నెస్ ను వ్యాపార ధోరణిగా మార్చేశారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు సంబంధించిన జీవో ను తక్షణమే ఇవ్వాలి. ఇప్పుడు జీవో ఇస్తేనే లక్షలాది మంత్రి తల్లితండ్రులకు ఉపశమనం లభిస్తుంది. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా తక్షణమే జీవో ఇవ్వాలి. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అనేది ప్రభుత్వ స్థలంలో ఉన్న స్కూల్. ఈ స్కూల్లో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏకంగా 120 శాతం ఫీజు పెంచేశారు. ప్రభుత్వానికి చెందిన స్కూల్లోనే 120 శాతం ఫీజు పెంచటమంటే ఏంటీ దౌర్భాగ్యం. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్ లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు?ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా? హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 30 ఎకరాల భూమిని కొట్టేసే కుట్ర చేస్తున్నారు. అక్కడి కమిటీలో ముఖ్యమంత్రి బంధువులు, ప్రభుత్వ పెద్దలు ఉన్నారు. అదే స్కూల్లో 14 ఏళ్లుగా ఒక పోస్ట్ లో మహిళ ఉన్నారు. ఆమె బోర్డులోకి వచ్చిన వారికి అవినీతి ఎలా చేయాలో నేర్పిస్తున్నారు. హైదరాబాద్ స్కూల్ లో చదివి గొప్ప వాళ్లు అయిన వాళ్లు డొనేషన్లు ఇస్తున్నారు. ఇటీవలే ఆ స్కూల్ పూర్వ విద్యార్థి సత్య నాదెళ్ల పెద్ద ఎత్తున విరాళం ఇచ్చారు. వాటన్నింటికీ అసలు ఎలాంటి లెక్క లేదు. విద్యాశాఖ మంత్రే ముఖ్యమంత్రి కావటం మన ఖర్మ.హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వ్యవహారంలో కచ్చితంగా ముఖ్యమంత్రి రివ్యూ చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఒక స్టాండ్ తీసుకోవాలి. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 120 శాతం ఫీజు పెరిగితే...నారాయణ, చైతన్య లాంటి స్కూళ్లలో ఎంత పెంచుతారు? తెలంగాణలో చాలా మంది బడ్జెట్ స్కూళ్లను, కాలేజ్ లను నడిపించారు. కొంతమంది యువత కలిసి విద్యార్థుల తల్లితండ్రులకు భారం పడకుండా కాలేజ్ లు, స్కూల్స్ నడిపించారు. కానీ ఆ స్కూల్స్ నడవకుండా కార్పొరేట్ స్కూల్స్ వాళ్లను మింగే ప్రయత్నం చేశారు. ఎథిక్స్ తో నడిచే స్కూళ్లతో మాకు ఎలాంటి సమస్య లేదు. తెలంగాణ సమాజానికి సమస్య ఉందంటే...తెలంగాణ రక్షణ సేనకు కూడా సమస్య ఉన్నట్లే. ఫీజుల దోపిడీకి సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు క్కటి కావాలి. అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల ముందు ధర్నా చేయాల్సిన అవసరముంది. ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో కూడా ఈ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. దాదాపు 11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయి. దీంతో కాలేజ్ లు మూతపడే పరిస్థితి వచ్చింది. ఫీజు రీయింబర్స్ మెంట్ ను బొంద పెట్టే విధంగా ఎంఎస్ -7 అనే జీవోను తెచ్చారు. పిల్లల తల్లితండ్రుల అకౌంట్ కు డబ్బులు వేస్తామంటున్నారు. ఒకవేళ ఫీజులు చెల్లించకుంటే తల్లితండ్రులు పోరాటం చేసే పరిస్థితి ఉండదు. రైతు భరోసా విషయంలో కూడా ఇదే జరుగుతోంది. రైతు భరోసా వేయకపోతే రైతులు బయటకు వచ్చి పోరాటం చేసే పరిస్థితి లేదు. ఈ జీవో కొట్టివేసే వరకు అన్ని పార్టీలు పోరాటం చేయాల్సి ఉంది. ఉచిత విద్య, వైద్యం విషయంలో నేను మాట తప్పను. నేను ఆడపిల్లను. అబ్దమాడను. ఇన్నాళ్లు అయ్యల పాలనలో మోసం జరిగింది. కానీ నేను అమ్మలా ఆలోచించే వ్యక్తిని. కచ్చితంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా. ఫ్రీ వైద్యం, విద్య ఇవ్వకపోతే అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టండి. తెలంగాణ రాష్ట్రం 12 వందల మంది అమరుల ప్రాణ త్యాగాలతో వచ్చింది.

ఎంతోమంది విద్యార్థుల వీపుల మీద లాఠీ దెబ్బలు పడ్డాయి. ఆ విధంగా తెచ్చుకున్న రాష్ట్రంలో సంవేదనతో పాలన చేయాల్సి ఉండే. మేము అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక నిపుణులతో చర్చించిన తర్వాత ఉచిత విద్య, వైద్యం అనే అంశాన్ని పెట్టాం. ఇవ్వాలనే మనసు ఉంటే కచ్చితంగా ఉచిత విద్య, వైద్యం ఇవ్వొచ్చు. తమిళనాడు తరహాలో మన వద్ద కూడా ఫీజు నియంత్రణ కోసం పర్మినెంట్ అథారిటీ ఉండాలి. లేదంటే గుజరాత్ లో మాదిరిగా ప్రాథమిక విద్యకు 15 వేలు, ఉన్నత విద్యకు 25 వేలకు మించి ఫీజు ఉండొద్దు. ఇందులో ఏ మోడల్ ను అయిన స్టడీ చేసి ప్రభుత్వం వాటిని అమలు చేయాలి.

# పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగే ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయాలి: రవి కుమార్ యాదవ్



**నిజం న్యూస్ శేర్లింగంపల్లి ప్రతినిధి , మే 6:** మే 10 న తెలంగాణ కు నరేంద్ర మోదీ విచ్చేయుచున్న సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభకు విచ్చేయుచున్న సందర్భంగా నియోజవర్గాలలో ముందస్తు బైక్ ర్యాలీలు చేపట్టి సభను విజయవంతం చేసేందుకు బి.జె.వై.యం డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించిన ...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపు ఉదయం తార నగర తుల్జా భవాని టెంపుల్ దగ్గర నుండి మియాపూర్ బొల్లారం చౌరస్తా వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలందరిని మోడీ సభకు హాజరయ్యే విధంగా యువమోర్చా నాయకులు నాయకులు చొరవ చూపాలని కోరారు తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒకటి, రెండు కాదు ఏకంగా రూ. 7,823 కోట్ల ప్రాజెక్టులను మన మోదీ ప్రారంభించనున్నారని, తెలంగాణ అభివృద్ధి కోసం వస్తున్న మన ప్రధాని మోదీ కి ఘన స్వాగతం పలుకుదామని, మే 10వ తేదీన సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న మన ప్రధాని మోదీ బహిరంగ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ప్రతి డివిజన్, కాలనీ, బూత్ల నుండి యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చేలా ప్రయత్నించాలని దిశా నిర్దేశం చేశారు, అలాగే రేపు జరగబోయే బైక్ ర్యాలీ లను విజయవంతం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, వసంత్ యాదవ్ చంద్రమౌళి ,అర్జున్ ,మల్లేష్ గౌడ్, సామ్రాట్ గౌడ్, సందీప్, మాన్యం యాదవ్,బంటి, కరణ్ గౌడ్, మొదలగువారు పాల్గొన్నారు.

# విద్యార్థి కదిలే మేఘం



నిజం న్యూస్ హైదరాబాద్,
మే 06,

విధ్యార్థి జ్ఞానార్థి
పాఠశాల వొడిలో
గురుబోధల
ఔపోసనల
చలనశీలి
చైతన్యధీప్తి
జ్ఞానాన్ని గుప్పిటపట్టి
వర్తమాన వెన్నుపై
భవిష్య ప్రగతి నిర్మాణానికి
పయనమయ్యే మేఘం
జ్ఞానార్జన జగతికొరకు
జ్ఞానం శీలతకొరకు
ధర్మార్థ కామమోక్ష పురుషార్థ
నియమాల
బోధివృక్షమే పాఠశాల
సారంలేని చదువులు
బాధ్యతలెరుగని బతుకులు
సంస్కారమెరుగని
సానిబతుకులు
చచ్చుపుచ్చులబతుకున్నీ
నేలజారిన నేతిచందమే...
పారే నీటిలా
వీచే గాలిలా
జ్ఞానం పయనించాల్సందే
జ్ఞానం పంచాల్సిందే
జ్ఞానమేఘమా...
పయనించు...
వర్షించు...
జ్ఞాననిధుల ఫలాల పండగ.

-కొండూరి. కోటిబాబు,
హైకోర్టు అడ్వకేట్
ఎస్ పి టి యు,
హైదరాబాద్

# మీ బలిదానం వృథా కాలేదు

మీ త్యాగాలను బెంగాల్ ఎప్పటికీ మర్చిపోదు...



**నిజం న్యూస్ హైదరాబాద్,మే6:** కేవలం కాషాయజెండా ఇంటిమీద కట్టుకున్నారనే నెపంతో ఈ కుటుంబాన్ని దారుణంగా నరికి చంపేసారు బెంగాల్లో.

రక్తం చిందించిన ప్రతి వీరుడి జ్ఞాపకమే ఈ విజయం...

ఆత్మార్పణ చేసిన ప్రతి యోధుడి ఆశయమే ఈ గెలుపు...

ఈ విజయం... మీ లాంటి త్యాగమూర్తుల చెమట, రక్తం, నమ్మకానికి వచ్చిన ప్రతిఫలం

జోహార్ బెంగాల్ అమర వీరుల్లారా.

# పాపికొండల యాత్ర నిలిపివేత



**నిజం న్యూస్ హైదరాబాద్, మే 6:** గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండల విహారయాత్ర'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను రద్దు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది.

# ఐపీఎస్ అధికారిణినే వస్తావా నీ రేటు ఎంత అని అడిగిన పోకిరీలు



**నిజం న్యూస్ హైదరాబాద్, మే 6:** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే IPS సుమతి గ్రౌండ్ లెవెల్ పరిస్థితులపై దృష్టి పెట్టారు. రాత్రి 12 గంటల సమయంలో దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో ఎలాంటి సెక్యూరిటీ లేకుండా, సాధారణ మహిళలా వేషం మార్చుకుని బస్టాండ్‌లోకి వెళ్లారు. ఆమె ఎవరో తెలియక కొందరు పోకిరీలు ఆమెను చుట్టుముట్టి వస్తావా? నీ రేటు ఎంత? ఎంతివ్వాలంటూ అంటూ వెకిలి ప్రశ్నలు అడగడం ప్రారంభించారు. ఆ మూడు గంటలలో ఎలాంటి పెట్రోలింగ్ వాహనం గానీ, పోలీసులు గానీ అక్కడికి రాకపోవడంతో మరింతగా రెచ్చిపోయారు ా× వచ్చి సెల్యూట్ చేయడంతో ఆమె IPS కమిషనర్ సుమతి అని తెలిసింది 40 మంది పోకిరీలను అదుపులోకి తీసుకుని వారికి గట్టి హెచ్చరిక చేశార

## గాజులరామారం హనుమాన్ దేవస్థానంలోని శ్రీ ఆంజనేయ స్వామి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, మే 6:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని హనుమాన్ దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కుమారుని హనుమాన్ మాలధారణ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి వారి పూజలో పాల్గొన్నారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ హనుమాన్ మాల ధారణలో ఉన్న స్వాములతో కలిసి శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి వారికి పాలాభిషేకం, పూలహారాలు స్వాముల భజన మంత్రాల మధ్య శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## కొలను హనుమంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన INTUC అధ్యక్షులు కర్కనాగరాజు



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, మే 6:** కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హనుమంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షుడు, హెచ్.ఎ.ల్ గుర్తింపు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్కనాగరాజు ఆధ్వర్యంలో కొలనుహనుమంత్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని కొలను హనుమంత్ రెడ్డి కి శాలువ తో సత్కరించి పూల బొకేతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కొలను హనుమంత్ రెడ్డి భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రజలకు మరింత సేవచేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్ యూనియన్ జాయింట్ సెక్రటరీ వద్దే నాగార్జున,పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మే 10న జరిగే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు హాజరుకావాలని ఇంటింటికి కరపత్రాలు పంచిన వడ్డేపల్లి రాజేశ్వరరావు





**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 6:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా తెలంగాణకు విచ్చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, మే 10'వ తేదీ ఆదివారం సాయంత్రం 4.00 గంటలకు సికింద్రబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ బుధవారం కూకట్‌పల్లి డివిజన్ లో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తూ వాల్ రైటింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వయంగా గోడపై పార్టీ గుర్తు చిత్రీకరించి (వాల్ రైటింగ్ చేసి) ప్రజలను సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణకు మరింత అభివృద్ధి దిశగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమం తెలంగాణ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు హర్షణ పల్లి సూర్యారావు , సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ దేశబత్తుల సుధా రవి, కూకట్ పల్లి నియోజకవర్గ నాయకులు సురేందర్ రెడ్డి, కర్క డాకయ్య, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఐలయ్య యాదవ్, శివరంజని, మల్లేష్, రూప,బిజెపి కార్యకర్తలు, టీం వి.ఆర్.ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్: బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 6:** కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కొలను హనుమంత రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం బాచుపల్లిలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు కేక్ కట్ చేసి తినిపించారు శాలువా కప్పి హనుమంత రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడం ద్వారా పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని రమేష్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మి శివా చౌదరి ,హరి ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్

గురువారం 07- 05 - 2026

# ఆడియెన్స్ దీనికి కూడా డబ్బులు ఇవ్వాలా?



తెలుగు సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆలోచనలు ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటాయి. సినిమాను ఎలా తీయాలో మాత్రమే కాదు, దాన్ని జనాల్లోకి ఎలా తీసుకెళ్లాలో కూడా ఆయనకు బాగా తెలుసు. ప్రస్తుతం మహేష్ బాబుతో ఆయన చేస్తున్న అడ్వెంచర్ డ్రామా 'వారణాసి'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. దాదాపు 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పరంగా కీలక దశకు చేరుకుంది. అయితే సినిమా రిలీజ్‌కు ముందే ఒక టాక్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చెక్కర్లు కొడుతోంది. ఇది విన్న సినీ ప్రియులు కొంత ఆశ్చర్యానికి, మరికొంత ఆందోళనకు గురవుతున్నారు. అసలు విషయం ఏంటంటే, ఈ సినిమాకు సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ మేకింగ్ వీడియోలు, తెర వెనుక దృశ్యాలను వారణాసి దీూ అంటూ వీడియో రిలీజ్ చేయడానికి ప్లాన్ లో ఉన్నారట. అయితే చూడటానికి మేకర్స్ ఒక సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను ప్రవేశపెట్టబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. సుమారు 199 రూపాయలు చెల్లిస్తేనే ఆ కంటెంట్ చూసే అవకాశం ఉంటుందట. సాధారణంగా మేకింగ్ వీడియోలు అంటే సినిమాపై హైప్ పెంచడానికి ఉచితంగా వదిలే ప్రమోషనల్ స్టఫ్. కానీ రాజమౌళి లాంటి పెద్ద దర్శకుడు ఇలా మేకింగ్ వీడియోలకూ డబ్బులు వసూలు చేయాలని చూడటం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇది నిజంగా జక్కన్న స్ట్రాటజీయేనా లేక కేవలం పుకారా అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే మాత్రం ప్రేక్షకుల నుంచి నెగిటివ్ రియాక్షన్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే టికెట్ రేట్ల పెంపుతో సామాన్య ప్రేక్షకుడు థియేటర్‌కు రావాలంటేనే ఆలోచిస్తున్నాడు. ఇలాంటి తరుణంలో కేవలం మేకింగ్ వీడియోల కోసం కూడా డబ్బులు అడగటం అనేది కొంత కరెక్ట్ కాదని నెటిజన్లు పెదవి విరుస్తున్నారు. "సినిమా టికెట్‌కు ఎలాగూ పే చేస్తాం, కానీ షూటింగ్ వీడియోలకూ డబ్బులేంటని" సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. ఒకవేళ బడ్జెట్ రికవరీ కోసమే ఇలా చేస్తున్నారనుకున్నా, ఇది ఎంతవరకు వర్కవుట్ అవుతుందనేది అనుమానమే. ప్రస్తుతం ఈ సినిమా కోసం జక్కన్న హాలీవుడ్ స్థాయి టెక్నాలజీని వాడుతున్నారు. మహేష్ బాబును గతంలో ఎన్నడూ చూడని స్టైల్ లో చూపిస్తూ, ప్రియాంక చోప్రా వంటి గ్లోబల్ స్టార్లను కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం చేశారు. అంతా బాగానే ఉంది కానీ, ఇలాంటి వినూత్నమైన మార్కెటింగ్ ప్రయత్నాలు బెడిసికొడితే సినిమా ఇమేజ్‌పై ప్రభావం చూపే ఛాన్స్ ఉంది. ఇప్పటికే ఈ సబ్‌స్క్రిప్షన్ వార్తలపై మీమ్స్ రచ్చ మొదలైంది. అసలు విషయం ఏంటనేది చిత్ర యూనిట్ అధికారికంగా క్లారిటీ ఇస్తే తప్ప ఈ గందరగోళం ముగిసేలా లేదు. ఇక రాజమౌళి సినిమా అంటే బాక్సాఫీస్ వద్ద సునామీ ఖాయం. కానీ ఇలాంటి చిన్న చిన్న విషయాల్లో నెగిటివిటీ రాకుండా చూసుకోవడం మేకర్స్ బాధ్యత. బహుశా హాలీవుడ్ సినిమాలకు ఉండే పర్సనల్ యాప్ లేదా క్లబ్ మెంబర్‌షిప్ తరహాలో ఏదైనా ప్లాన్ చేస్తున్నారేమో చూడాలి.



# నార్త్ లో 'పెద్ది'.. భయపడాల్సిన అవసరమే లేదా?

**ముఖ్యంగా చరణ్ ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించబోతున్నారని టాక్ వినిపిస్తోంది.**

**మాస్, ఎమోషన్, డ్రామా కలిపిన ప్యాకేజ్ గా సినిమా ఉండబోతుందనే అంచనాలు ఉన్నాయి.**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ పెద్ది జూన్ 4వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. విడుదలకు ముందే ఆ సినిమా అన్ని విషయాల్లో కూడా హాట్ టాపిక్ గా మారుతోంది. థియేట్రికల్ బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగిందని కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో పెద్దిపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉప్పెనతో ఇండస్ట్రీలో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు సాన పెద్ది చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్ ఫుల్ ఎమోషనల్ కథతో పెద్ది ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. ముఖ్యంగా చరణ్ ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించబోతున్నారని టాక్ వినిపిస్తోంది. మాస్, ఎమోషన్, డ్రామా కలిపిన ప్యాకేజ్ గా సినిమా ఉండబోతుందనే అంచనాలు ఉన్నాయి. ఇక సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర కూడా ప్రత్యేకంగా ఉండబోతుందని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఆమెకు ఇది మరో స్ట్రెయిట్ తెలుగు చిత్రం కావడంతో నార్త్ ఆడియన్స్ లో కూడా ఆసక్తి పెరిగింది. దీంతో సినిమా సౌత్ తో పాటు నార్త్ మార్కెట్ లో కూడా మంచి వసూళ్లు సాధించే అవకాశాలు ఉన్నాయని అంతా భావిస్తున్నారు. అయితే పాన్ ఇండియా సినిమాలకు హిందీ బెల్ట్ కలెక్షన్స్ కీలకం. అక్కడ మంచి ఓపెనింగ్స్ రాకపోతే మొత్తం బిజినెస్ పై ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో పెద్దికి ఒక్క సవాల్ ఎదురవుతుందనే చర్చ జరుగుతోంది. అదేంటంటే.. జూన్ 5న బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ నటించిన మరో చిత్రం విడుదల కావడం. దీంతో థియేటర్స్ షేరింగ్ విషయంలో పోటీ ఉండొచ్చని భావిస్తున్నారు. కానీ ఆ పోటీని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సినీ ప్రియులు చెబుతున్నారు. పెద్దికి పాజిటివ్ టాక్ వస్తే, హిందీ మార్కెట్ లో కూడా దాన్ని అడ్డుకోవడం కష్టమేనని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ కు ఇప్పటికే పాన్ ఇండియా రేంజ్ లో ఇమేజ్ ఏర్పడింది. గత చిత్రాల ద్వారా హిందీ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇంకా ముఖ్యంగా పెద్ది మూవీని హిందీ మార్కెట్ లో ప్రముఖ సంస్థ జియో స్టూడియోస్ భారీ స్థాయిలో విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. థియేటర్స్ విషయంలో ముందుగా ప్లానింగ్ పూర్తి చేసినట్లు సమాచారం. దీంతో స్క్రీన్ కౌంట్ పరంగా పెద్దికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే, పెద్దికి నార్త్ లో పోటీ ఉన్నప్పటికీ అది పెద్ద అడ్డంకిగా మారే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. కంటెంట్ స్ట్రాంగ్ ఉంటే, పాజిటివ్ టాక్ వస్తే.. బాక్సాఫీస్ వద్ద సినిమా వసూళ్లు సునామీ సృష్టించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పుడు అందరి దృష్టి జూన్ 4పై పడింది. మరి పెద్ది పాన్ ఇండియా రేంజ్ ఎలాంటి హిట్ అవుతుందో అంతా వేచి చూడాలి.

# నల్ల చీరలో పాయల్ హొయలు





సినీ పరిశ్రమలో ఎప్పుడూ లైమ్ లైట్ లో ఎలా ఉండాలో..ప్రేక్షకుల దృష్టిని ఎలా ఆకర్షించాలో పాయల్ రాజ్‌పుత్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో!. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ భామ తాజాగా పోస్ట్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. బ్లాక్ అండ్ గోల్డ్ లైనింగ్ శారీలో పాయల్ మెరిసిపోతున్న తీరు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. అందమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ఈ యంగ్ బ్యూటీ ప్రదర్శించిన హొయలు కుర్రకారును విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఎంపిక చేసిన బ్లాక్ శారీపై గోల్డ్ షైన్ పాయల్ లుక్ ని ఎలివేట్ చేసిందనే ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ డిజైనర్ శారీలో పంజాబీ సోయగం లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 2 పాయల్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. తన మనసులోని భావాలను కూడా అంతే నిజాయితీగా ఓపెనవుతుంది. ఇటీవల ఒక సినిమా ప్రమోషన్స్ సందర్భంగా తెలుగు మీడియా తన దివంగత తండ్రి గురించి అడిగిన ప్రశ్నకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో కన్నీటి పర్యంతమై అక్కడి నుండి నిష్క్రమించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పాయల్ ఎంత సెన్సిటివ్.. ఉద్వేగభరితమైన వ్యక్తి అనేదానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది. అయితే తన వృత్తిగత కట్టుబాట్లకు ప్రాధాన్యతనిస్తూ పాయల్ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. టాలీవుడ్‌లో ఎలాంటి గాడ్ ఫాదర్ లేకుండానే పాయల్ తన స్వయంకృషితో అవకాశాలను అందుకుంటోంది. అవకాశాలు ఉన్నా లేకపోయినా ఎప్పుడూ ఆశావహ దృక్పథంతో తనను తాను ఒక ఉత్తమ నటిగా మలుచుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కెరీర్ విషయంలో ఎంతో ప్రయోగాత్మక ఆలోచనలతో ముందుకు సాగే పాయల్.... గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం పాయల్ ధరించిన చీర కట్టుపై ఇంటర్నెట్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఇక పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం -గోల్‌మాల్- ..-కిరాతక- వంటి ఆసక్తికరమైన ప్రాజెక్టులలో భాగమైంది. -గోల్‌మాల్- చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇది ఒక పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే -కిరాతక- సినిమా కూడా తన కెరీర్‌లో ఒక విభిన్నమైన చిత్రంగా నిలుస్తుందని సమాచారం. ఈ రెండు సినిమాలు 2026 ద్వితీయార్థంలో లేదా ఏడాది చివరలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఏంటమ్మా ఈ న్యూ లుక్కు మొత్తానికి పాయల్ రాజ్‌పుత్ తన జీవితంలోని కీలకమైన వ్యక్తిగత, వృత్తిగత వ్యవహారాలను బ్యాలెన్స్ చేస్తూ నటిగా నిరూపించుకునే దిశగా దూసుకుపోతోంది. ఓ పక్క తన తండ్రి జ్ఞాపకాలతో కూడిన ఉద్వేగం..మరోవైపు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసే ఫోటో షూట్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. విభిన్నమైన కథాంశాలతో రూపొందుతున్న తన తదుపరి సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాయో చూడాలి.

# స్టార్ పవర్ మాత్రమే సరిపోదు!




ఒకప్పుడు స్టార్ హీరోల క్రేజ్ తోనే థియేటర్లు హౌస్ ఫుల్ అయిపోయేవి. భారీ కాంబినేషన్లు, క్రేజీ ప్రాజెక్టులు అంటే? చాలు బాక్సాఫీస్ వద్ద రికార్డులు ఖాయమని భావించేవారంతా. కానీ మారుతోన్న కాలంతో పాటు ప్రేక్షకుల అభిరుచి కూడా పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ప్రేక్షకులు కేవలం హీరోల ఇమేజ్ చూసో లేక భారీ హంగులను చూసో? సినిమాలను ఆదరించడం లేదు. కథలో బలం లేకపోతే ఎంతటి దిగ్గజ నటుల సినిమానైనా నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నారని ఇటీవల విడుదలైన చిత్రాలు నిరూపించాయి. మలయాళ చిత్ర పరిశ్రమలో ఇద్దరు అగ్రతారలు మోహన్ లాల్ - మమ్ముట్టి 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కలిసి నటించిన చిత్రం -పేట్రియాట్- ఇద్దరు దిగ్గజాలు ఒకే స్క్రీన్‌పై కనిపిస్తున్నారంటే? అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ ఇటీవల విడుదలైన -పేట్రియాట్- బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. స్టార్ పవర్ ఎంత ఉన్నా? బలహీనమైన కథనం , ఆసక్తి లేని సన్నివేశాల వల్ల కారణగా ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించలేదు. కేవలం కాంబినేషన్ క్రేజ్ సినిమాను గట్టెక్కించలేదని సినిమా ఫలితం మరోసారి రుజువు చేసింది. అలాగే దక్షిణాదిలో అద్భుతమైన నటిగా గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీపై భారీ అంచనాలే ఉండేవి. ఆమె నటించిన హిందీ చిత్రం -ఏక్ దిన్- ఎంతో హైప్ మధ్య రిలీజ్ అయింది. నటిగా సాయి పల్లవి పాస్ అయింది. కానీ కథలో దమ్ము లేకపోవడంతో ఈ సినిమా కూడా ప్రేక్షకులను నిరాశపరిచింది. ఒక నటిగా తన ప్రతిభను చాటుకున్నా? సినిమా విజయవంతం కావడానికి నటన మాత్రమే సరిపోదని పటిష్టమైన కథాంశం ఉండాలని ఈ చిత్రం మరోసారి రుజువు చేసింది. అలాగే విలక్షణ నటుడు ధనుష్ నటించిన -కరా- చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. జాతీయ అవార్డు గ్రహీత, విభిన్నమైన పాత్రలను ఎంచుకునే ధనుష్ సినిమా కూడా నిరాశ పరచడం సినీ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ సినిమాలన్నీ నేర్పుతున్న పాఠం ఒక్కటే. భారీ బడ్జెట్, విదేశీ లొకేషన్లు, స్టార్ కాస్టింగ్ వంటివి అలంకారాలు మాత్రమే. సినిమాకు అసలైన ప్రాణం కథ. అది లేనప్పుడు మిగిలిన ఎన్ని హంగులు ఉన్నా ? అది వృధా ప్రయాసగానే మిగిలిపోతుందన్నది కాదనలేని నిజం. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రేక్షకులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కంటెంట్‌ను వీక్షిస్తున్నారు. దీంతో వారిలో సినిమాపై అవగాహన పెరిగింది. రొటీన్ ఫార్ములా కథలు, లాజిక్ లేని యాక్షన్ సన్నివేశాలను అంగీకరించడం లేదు. చిన్న సినిమా అయినా? అందులో కొత్తదనం ఉంటే బ్రహ్మరథం పడుతున్నారు. అదే సమయంలో వందల కోట్ల బడ్జెట్ ఉన్న పెద్ద సినిమాల్లో విషయం లేకపోతే మొదటి రోజే తిప్పి కొడుతున్నారు. ఈ ట్రెండ్ స్టార్ హీరోలకు - దర్శకులకు ఓ హెచ్చరిక లాంటిది. స్టార్ పవర్ అనేది ప్రేక్షకులను థియేటర్ వరకు తీసుకురావడానికి మాత్రమే. ఆపై కంటెంట్ మాత్రమే సత్తా చాటాల్సి ఉంటుంది.

# హీరోయిన్ల నిరీక్షణ సక్సెస్ కోసం ఎదురు చూపులు!



ఒడస్ట్రీలో సక్సెస్ అనేది నటీనటుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ముఖ్యంగా హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ వారు అందుకునే సక్సెస్‌లపైనే ఆధారపడి ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో టాలీవుడ్ లో వరుసగా పెద్ద సినిమాలు వాయిదా పడుతుండటంతో హీరోయిన్ల ఆశలపై నీళ్లు చల్లినట్లు అవుతుంది. అనుకున్న సమయానికి సినిమాలు విడుదల కాకపోవడంతో? నెక్స్ట్ లెవెల్ కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్న ముద్దుగుమ్మలు నిరీక్షణలో పడిపోతున్నారు. 00:13 / 02:25 పాన్ ఇండియాలో గుర్తింపు దక్కించుకున్న కియారా అద్వానీ యష్ సరసన -టాక్సిక్-లో నటిస్తోంది. ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకుంది అమ్మడు. ఈ సినిమా షూటింగ్ - రిలీజ్ విషయంలో జరుగుతోన్న జాప్యం అమ్మడిని కొంత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో తన క్రేజ్ పెంచుకోవాలని భావించిన కియారాకు ఈ వాయిదాతో మరో భారీ హిట్ అందుకోవడానికి సమయం పట్టేలా కనిపిస్తోంది. ఇలాంటి క్రేజీ ప్రాజెక్టులు ఆలస్యమైనప్పుడు ఇతర సినిమాలకు డేట్లు కేటాయించడం కూడా సవాలుగా మారుతోందిట. అలాగే అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. అమయ్మడు నటించిన -దేవర- మంచి విజయం సాధించినా ప్రస్తుతం రామ్ చరణ్ సరసన నటిస్తోన్న -పెద్ది- సినిమాతో మరో భారీ బ్లాక్ బస్టర్ అందుకోవాలని ఆరాటపడుతోంది. మార్చిలో రిలీజ్ అవ్వాల్సిన సినిమా జూన్ కి షిఫ్ట్ అవ్వడంతోకొంత నిరాశకు గురైంది. కానీ ప్రొడక్ట్ పై జాన్వీ చాలా నమ్మకంగా ఉంది. -పెద్ది- విజయంతో ప్రేక్షకులకు మరింత దగ్గరవ్వాలని ఎంతో ఆశపడుతోంది. ఈ సినిమా సక్సెస్ అమ్మడికి అత్యంత కీలకమైంది కూడా. పెద్ది తర్వాతే కొత్త ప్రాజెక్ట్ విషయంలో ఓ నిర్ణయానికి వస్తుందని సమాచారం. టాలీవుడ్‌కి సెన్సేషనల్ ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీ బోర్సే కూడా వాయిదా ప్రభావానికి గురవుతోంది. ఆమె నటిస్తోన్న తాజా చిత్రం -లెనిన్- విడుదల జూన్ కు వాయిదా పడింది. వరుస ఫ్లాప్ ల పరంపరలో -లెనిన్- తో హిట్ కొట్టి ఫ్లాప్ ఇమేజ్ నుంచి ఎంత తొందరగా బయట పడదామన్నా వాయిదా నిరాశ పరుస్తోంది. ఇలా సినిమాల వాయిదా ప్రభావం విడుదల తేదీలకే పరిమితం కాదు. ఇది హీరోయిన్ల రెమ్యూనరేషన్ , కొత్త అవకాశాలపై కూడా పడుతుంది. ఒక సినిమా హిట్ అయితే వచ్చే క్రేజ్‌తో కొత్త ప్రాజెక్టులు సైన్ చేసే అవకాశం ఉంటుంది. కానీ సినిమాలు వాయిదా పడినప్పుడు పాత సినిమాల ప్రమోషన్ల కోసమే సమయం కేటాయించాల్సి వస్తుంది. దీంతో వారి కెరీర్ ప్రణాళికలు తలకిందులయ్యే అవకాశం ఉంది. కియారా, జాన్వీ, భాగ్యశ్రీ ఇదే సందిగ్ధం లో ఉన్నారు. చిత్ర పరిశ్రమలో నిరీక్షణ అనేది ఓ భాగం. భారీ బడ్జెట్ సినిమాలు, గ్రాఫిక్స్ పనులు ఇతర కారణాల తో వాయిదాలు సహజమే. అయితే అవి హీరోయిన్ల కెరీర్ వేగాన్ని కొంత తగ్గిస్తాయి. అయినా నాణ్యమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడమే ఉత్తమని భావిస్తారన్నది అంతే వాస్తవం. జూన్ నెలలో విడుదలయ్యే ఈ చిత్రాలు భామల నిరీక్షణకు తగిన ప్రతిఫలాన్ని అందిస్తాయని ఆశీద్దాం